సాక్షి
చిత్తూరు
శనివారం । 29 । జూన్ । 2024



అక్కడ ఉద్యోగం.. ఇక్కడ..
జర్మనీలో ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్న శ్రీధర్ తన సొంతూరిలో వ్యవసాయం చేసుకుంటున్నారు. - 8లో




దర్జాగా కబ్జా
వి.కోట మండలం కొంగాటం పంచాయతీలో ఉన్న గనికి సంబంధించిన భూమిని టీడీపీ నేత కబ్జా చేశాడు. - 8లో



హనుమంతునిపై సుందరరాజస్వామి
తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో కొలువైన సుందరరాజస్వామి అవతారోత్సవాలు సాగుతున్నాయి. - 8లో

బరువెక్కిన బడి సంచి

ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల తీరుతో చిన్నారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. కార్పొరేట్ ఆర్భాటాల కారణంగా వయసుకు మించిన భారం మోస్తున్నారు. ఇష్టారాజ్యంగా అంటగడుతున్న పుస్తకాలను మోయలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. లేలేత భుజాలపై మోపుతున్న బుక్స్ బరువుకు కుంగిపోతున్నారు. ఎదుగుదల లోపం వంటి అనారోగ్య సమస్యలకు గురై ఉక్కిరిబిక్కిరవుతున్న పిల్లలను చూసి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. నిబంధనలను పాటించని ప్రైవేట్ బడులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.



వైద్య నిపుణుల అభిప్రాయం ఇలా..

- పిల్లల్లో సాధారణంగా 15 ఏళ్ల లోపే శరీరంలో వివిధ మార్పులు చోటు చేసుకుంటాయి.
- పాఠశాల వయసులో మోయాల్సిన భారం కంటే అధిక బరువు మోయడం వల్ల స్కోలియోసిస్ (వెన్నెముక ఒక వైపు వంగిపోవడం) వంటి ఇబ్బందులు తలెత్తుతాయి.
- అధిక బరువుతో కూడిన పెద్దసైజు బ్యాగులు కాకుండా పుస్తకాలకు సరిపడా తేలికైనవి కొనుగోలు చేయాలి.
- విద్యార్థి బరువులో పుస్తకాల బ్యాగు బరువు 15 శాతానికి మించకూడదు. ఉదాహరణకు 20 కిలోల బరువున్న విద్యార్థి 3 కిలోలకు మించి మోయకూడదు.
- ఎక్కువ పుస్తకాలుంటే ఉపాధ్యాయుల సలహా మేరకు ఏ రోజున అవసరమైన పుస్తకాలను ఆ రోజున తీసుకెళ్లేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- బ్యాగును రెండు భుజాలపై సమాన బరువు పడే రీతిలో తగిలించుకోవాలి. ఒకవైపు తగిలించుకుంటే భుజం, మెడ నొప్పి వస్తాయి.
- బ్యాగు నడుము కింది వరకు వేలాడుతూ ఉండరాదు.
- నిత్యం వ్యాయామం చేయడం వల్ల శారీరక పరమైన ఇబ్బందులను అధిగమించవచ్చు.

- బాల్యంపై స్కూల్ బ్యాగు భారం
- ఏటా పెరుగుతున్న పుస్తకాలు
- లేత భుజాలపై మోయలేని బరువు
- నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు
- పర్యవేక్షించని విద్యాశాఖ అధికారులు

ఉమ్మడి జిల్లా ప్రైవేట్ బడుల సమాచారం

చిత్తూరు జిల్లాలోని	తిరుపతి జిల్లాలోని
పాఠశాలలు 408	పాఠశాలలు 709
విద్యార్థులు 79,734	విద్యార్థులు 1,20,793

చిత్తూరు కలెక్టరేట్ : ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వయసులో పుస్తకాల భారం విద్యార్థులకు శాపంగా మారుతోంది. పై తరగతికి వెళ్లే కొద్దీ.. పుస్తకాల సంఖ్య కూడా దానికి తగ్గట్టుగానే పెరుగుతోంది. ప్రైవేటు స్కూళ్లలో వాటిని మోస్తూ పిల్లలు పడే బాధలు అన్నీ ఇన్నీ కావు. బ్యాగు నిండా పుస్తకాలతో నాలుగైదు అంతస్తుల మెట్లు ఎక్కేందుకు నానా తంటాలు పడుతున్నారు. పుస్తకాల భారం తగ్గించాలని 2006లో చట్టం చేసినా అమలుకు మాత్రం విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

ప్రైవేట్‌గానూ కొనుగోలు..

ప్రభుత్వ పాఠశాలలు, సర్కారు గుర్తింపు పొందిన బడుల్లో విధిగా గవర్నమెంట్ ముద్రించిన పాఠ్యపుస్తకాలతోనే విద్యార్థులకు బోధన చేయాలి. స్టేట్, సీబీఎస్‌ఈ సిలబస్ మినహా మరే ఇతర పాఠ్యాంశాలను బోధించకూడదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు మాత్రం ఐఐటీ కోచింగ్, స్మార్ట్ క్లాసులు, రివిజన్ టెస్టుల పేరుతో సాధారణ పాఠ్యపుస్తకాలతోపాటు ప్రైవేట్ ముద్రణ సంస్థల పుస్తకాలను కొనుగోలు చేయాల్సిందిగా తల్లిదండ్రులకు స్పష్టం చేస్తున్నాయి. దీంతో పాటు అదనపు పుస్తకాలను పాఠశాలలోనే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో నిబంధనలను పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థుల బడి సంచి బరువుపై ప్రభుత్వం జీఓ నంబర్ 22 విడుదల చేసింది. తరగతుల వారీగా అన్ని యాజమాన్యాల పరిధిలోని స్కూళ్లల్లో పుస్తకాల బరువు నిర్ణయించి, అంతే ఉండాలని స్పష్టం చేసింది. అయితే ఆ జీఓను ఏ ప్రైవేట్ పాఠశాల అమలు చేయడం లేదు.

నిబంధనలు బేఖాతర్

డీఈఓ ద్వారా వార్షిక విద్యా ప్రణాళిక విడుదలవుతుంది. పాఠ్యాంశాలు, పరీక్షలు, సాంస్కృతిక, ఆరోగ్య పరిరక్షణ కింద పలు అంశాలతో పట్టిక రూపొందించాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల కోసం ప్రత్యేక నిబంధనలతో పట్టిక విడుదల చేసి, ఆయా పాఠశాలల్లో రోజువారీ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై నిరంతరం తనిఖీలు చేపట్టాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో ఆ విధానం అమలు కావడం లేదు.

అనవసరమైనవే ఎక్కువ

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు 6 నుంచి 7 వరకు పాఠ్యపుస్తకాలు, మరో 6 నోట్ బుక్స్, కాపీరైట్‌కు సంబంధించి 4 పుస్తకాలు ఉంటాయి. ప్రైవేట్ పాఠశాలలు మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ 10 నుంచి 34 వరకు పుస్తకాలు, నోటుబుక్స్ అమ్ముతున్నారు. తల్లిదండ్రులపై ఫీజులు, విద్యార్థులపై పుస్తకాల భారం మోపుతున్నారు. ఒకటో తరగతి చదివే విద్యార్థికి సాధారణంగా 14 పుస్తకాలు ఉండాలి. కానీ, 32 నుంచి 34 ఉంటున్నాయి. ప్రింటెడ్ కాపీరైట్, ప్రింటెడ్ కలర్ కంపోజింగ్, హోమ్ స్కూల్ ఎక్సర్‌సైజ్, రైటింగ్ ఇంప్రూవ్‌మెంట్, లాంగ్వేజ్ డిక్షనరీ, డ్రాయింగ్ తదితరాలను అదనంగా జోడిస్తున్నారు.





అధిక బరువుతో ఉన్న బ్యాగులను మోసుకుంటూ పాఠశాలకు వెళుతున్న పిల్లలు

పర్యవేక్షణ శూన్యం



నిబంధనల అమలులో విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ శూన్యం. ప్రైవేట్, కార్పొరేట్ బడుల్లో ఇష్టానుసారం సొంతంగా ముద్రించిన పుస్తకాలను విక్రయిస్తున్నారు. ఈ మేరకు రూ.వేలు గుంజేస్తున్నారు. వీరి అంటగట్టే పుస్తకాలను మోయలేక చిన్నారులు అలసిపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసి చర్యలు చేపట్టాలి. పిల్లలకు ఇబ్బందులు తప్పించాలి.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

అధిక బరువుతో విద్యార్థులకు నష్టం



అధిక బరువును విద్యార్థులు ఏ మాత్రం మోయకూడదు. పాఠశాల వయసులో పిల్లలపై ఎక్కువ భారం మోపుతున్నారు. దీంతో వెన్నెముకపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. సాధ్యమైనంత వరకు తక్కువ పుస్తకాలనే తీసుకెళ్లాలి.

– ప్రవీణ, మెడికల్ ఆఫీసర్, పూతలపట్టు

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

నగరి : ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ఆస్పత్రి సిబ్బందికి లక్ష్యం కావాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ స్పష్టం చేశారు. శుక్రవారం నగరిలోని ప్రాంతీయ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. గైనిక్, క్యాజువాలిటీ, ఐసీయూ, మెడికల్ వార్డు, లేబర్ వార్డు, జనరల్ సర్జరీ వార్డు, పోస్ట్ ఆపరేటివ్ వార్డు (సిజేరియన్-ఫ్యామిలీ ప్లానింగ్ వార్డు)లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఏఎన్ఎంలు గర్భిణీల ఆరోగ్య స్థితిగతులపై పూర్తి అవగాహన పెంపొందించుకుని వారికి సకాలంలో సేవలందించాలని చెప్పారు. మాతా శిశు సంరక్షణలో భాగంగా శిశు మరణాలను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్యశ్రీ కింద రక్త పరీక్షలు చేసేందుకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేయాలని కోరారు. చంటి పిల్లలకి అవసరమైన మందులను ఆస్పత్రిలో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను త్వరితగతిన బ్లడ్ బ్యాంకుగా మార్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. డీసీహెచ్ఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రాంతీయ ఆస్పత్రికి రోజూ 500-600 ఓపీ కేసులు వస్తుంటాయిని, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ పీడియాట్రిక్ కేసుల ఎక్కువగా ఉంటాయని వెల్లడించారు. ఇక్కడ గైనకాలజిస్టు-3 జనరల్ సర్జన్-1,జనరల్ మెడిసిన్ -2, పీడియాట్రిక్-1, డెర్మటాలజీ-1,ఈఎన్‌టీ-1, అనస్తీషియా-2, ఆప్తమాలజీ-1వీటితో పాటు డెంటల్ డాక్టర్-1, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు-3, పెథాలజిస్ట్-1 విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికులు తమకు రావలసిన వేతన బకాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పారిశుద్య కార్మికులకు జీతాలు చెల్లించాల్సిన గుత్తేదారు వివరాలను ఆరా తీసి వెంటనే ఈ అంశాన్ని పరిష్కరించాలని డీసీహెచ్ఎస్‌కు సూచించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి, ఆర్ఎంఓ కార్తికేయన్ పాల్గొన్నారు.



నగరి ఆస్పత్రిలో వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టుకతో వచ్చే వ్యాధులపై అవగాహన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పిల్లలకు పుట్టుకతో వచ్చే వ్యాధులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులకు అవగాహన కల్పించారు. డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి మాట్లాడుతూ 0-18 ఏళ్లలోపు పిల్లల్లో కొందరికి పుట్టుకతో కొన్ని వ్యాధులు వచ్చే ప్రమాదముందన్నారు. వారందరికీ రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. ఈసేవలను బాధిత తల్లిదండ్రులు వినియోగించుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా పిల్లలకు పుట్టుకతో వచ్చే వ్యాధులను గుర్తించడంలో అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు. అన్ని రకాల పరీక్షలు చేయడంతో పాటు జన్యుపరమైన లోపాలు, పోషకాహార లోపం, వివిధ రకాల వ్యాధులను గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. లేకుంటే డీఈఐసీ సెంటర్‌కు రెఫర్ చేయాలని కోరారు. సమావేశంలో అధికారులు హర్షవర్ధన్, దుర్గా ప్రసాద్ నాయుడు, శ్రీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి

టీచ్ టూల్ ఓరియెంటేషన్‌కు నిధులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో లెవల్ 3 టీచ్ టూల్ ఓరియెంటేషన్ నిర్వహణకు రాష్ట్ర సమగ్రశిక్షశాఖ నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు జిల్లా సమగ్రశిక్ష అధికారులు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు కసరత్తు చేపట్టారు. ఓరియెంటేషన్ మొదటి స్పెల్ జూలై 1 నుంచి 10 వ తేదీ వరకు, రెండో స్పెల్ జూలై 18 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో రెండు స్పెల్స్ శిక్షణలను 13 బ్యాచ్‌లలో చేపట్టనున్నారు. ఇందులో 30 మంది మాస్టర్ ట్రైనర్స్, 571 మంది అబ్జర్వర్స్ మొత్తం 601 మంది పాల్గొననున్నారు. ఓరియెంటేషన్ నిర్వహణకుగాను రూ.28.42లక్షలు అవసరం అవుతుందని జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే రాష్ట్ర సమగ్రశిక్ష అధికారులు మొదటగా 75 శాతం రూ.21.31 లక్షల బడ్జెట్ మంజూరు చేశారు.

‘శిరస్సు’ సాకారమయ్యేనా?

- పడమటి ప్రాంతానికి వరం గంగమ్మ శిరస్సు ప్రాజెక్టు
- గతంలోనే రివైజ్డ్ ఎస్టిమేషన్ పంపిన ఇరిగేషన్ అధికారులు
- అటవీశాఖ అభ్యంతరాలు తొలగినా ముందుకెళ్లని పనులు
- ఎన్నికల ప్రచారంలో పలమనేరువాసులకు మాటిచ్చిన చంద్రబాబు
- ఆశగా ఎదురుచూస్తున్న ప్రజలు

పలమనేరు :జిల్లాలోని పడమటి ప్రాంతమైన పలమనేరు నియోజకవర్గంలో సాగు, తాగునీటికి బోర్లపైన ఆధారపడాల్సిందే. ఇక్కడి చిన్న నదులు వర్షాలు కురిసినపుడు మాత్రమే ప్రవహిస్తుంటాయి. అయితే వరద నీటికి అడ్డుకట్టవేసే ప్రయత్నాలను గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. దీంతో ఎగువప్రాంతాల్లో వర్షాలు కురిసి ఇక్కడి నదులు ప్రవహించినప్పుడల్లా సుమారు 55 ఎంసీఎఫ్‌టీల నీరు వృథాగా పారుగునే ఉన్న తమిళనాడులోని మోర్ధనా ప్రాజెక్టు చేరుతోంది. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో గంగమ్మ శిరస్సు ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. తదనంతరం చంద్రబాబు, కిరణ్ సర్కార్లు దీన్ని పూర్తిగా పట్టించుకోలేదు.

పదేళ్లుగా తప్పని ఇబ్బందులు

కౌండిన్య నదిపై రూ. 55కోట్ల వ్యయంతో పలమనేరు మండలంలోని కాలువపల్లె దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రిజర్వాయర్‌ను నిర్మించారు. దీనికి అనుసంధానంగా ఇక్కడికి సమీపంలోని నలగాంపల్లె వద్ద ఎరిగినేరి నదిపై రూ.10కోట్లతో గంగమ్మశిరస్సు ప్రాజెక్టుకు నిర్మాణానికి రంగం సిద్ధం చేశారు. ఇందుకోసం మొత్తం 80 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. 55మంది నిర్వాసిత రైతులకు రూ.4.22కోట్ల నష్టపరిహారం ప్రకటించింది. ఈ ప్రాజెక్టు కోసం టెండర్లు దక్కించుకొన్న బీవీహెచ్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఎర్త్ వర్క్ చేపట్టింది. ఈ క్రమంలో నష్టపరిహారం అందలేదని రైతులు పనులను అడ్డుకున్నారు. అప్పట్లో అధికారంలో ఉన్న కిరణ్ సర్కార్ ఈ ప్రాజెక్టు గురించి అసలు పట్టించుకోలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సైతం అటవీశాఖ అభ్యంతరాలను క్లియర్ చేయకుండా మీనమేషాలు లెక్కిస్తూ ప్రాజెక్టును గాలికొదిలేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంచనాలను పెంచి ఫారెస్ట్ క్లియరెన్స్ చేపట్టింది. అయితే ఆర్థికశాఖ ఆమోదం లేక పనులు ఆలస్యమయ్యాయి.

ఇప్పటికైనా జరిగేనా


అటవీశాఖ అభ్యంతరాలు తొలగినందున ప్రస్తుతం అధికారంలోని టీడీపీ వెంటనే టెండర్లను నిర్వహించి పనులను చేపట్టాలని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎలాగూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి సైతం ఎన్నికల సమయంలో మాటిచ్చారు కాబట్టి పనులను ఇప్పటి నుంచి మొదలు పెడితే ఈ నాలుగేళ్లలో పూర్తి చేయవచ్చని కోరుతున్నారు.





తమిళనాడుకు వృథాగా వెళుతున్న ఎరిగినేరు జలాలు (ఫైల్) నలగాంపల్లె ఆగిన ప్రాజెక్టు పనులు

అభ్యంతరాలు తొలగినట్టే..



గంగన్నశిరస్సు ప్రాజెక్టు పనులకు ఫారెస్ట్‌శాఖ నుంచి అభ్యంతరాలు తొలగినట్టే. ఇప్పటికే అటవీశాఖకు రెవెన్యూ భూమిని అప్పగించాం. స్టేజ్-1 క్లియరెన్స్ పూర్తయింది.గతంలో పంపిన రివైజ్డ్ అంచనాలు కాకుండా మళ్లీ పెంచాల్సిన పరిస్థితి ఉంది. ఆపై ప్రభుత్వ అనుమతులు, టెండర్ల ప్రక్రియ మొదలైతే పనులు ప్రారంభించవచ్చు. ఇక్కడి ఫారెస్ట్ అధికారులు కాస్త సహకరిస్తే బాగుంటుంది.

– వీఎన్‌సీ గిరి, ఈఈ, ఇరిగేషన్, పలమనేరు

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో రాహుకాల అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేపాకు, పూల తోరణాలతో సుందరంగా అలంకరించారు. రాహుకాల సమయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి గంగమ్మను దర్శించుకున్నారు. మహిళలు ఉపవాస దీక్షలతో అమ్మను సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రంగులేసి రెండోసారి..!

శ్రీరంగరాజపురం : జీడీ నెల్లూరు నియోజకవర్గం ముద్దుకుప్పం పంచాయతీ చొక్కమడుగు గ్రామంలో టీడీపీ నేతల ఓవర్ యాక్షన్ చూసి స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. ఇప్పటికే నడుస్తున్న వాటర్ ప్లాంట్‌ను మళ్లీ ప్రారంభించడంతో ఆశ్చర్యపోయారు. వివరాలు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎంపీ రెడ్డెప్ప మంజూరు చేసిన నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను అప్పటి డిప్యూటీ సీఎం నారాయణస్వామి 2020లో ప్రారంభించారు. అయితే స్థానిక టీడీపీ నేతలు ఈ వాటర్‌ప్లాంట్‌కు పచ్చరంగు వేశారు. ఎమ్మెల్యే థామస్ పుట్టినరోజును పురస్కరించుకుని శుక్రవారం ఆయన చేతులమీదుగా మళ్లీ ఈ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించడం స్థానికంగా చర్చనీయాంశమైంది.



వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే థామస్

న్యూస్‌రీల్

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు

పెద్దపంజాణి: శంకర్రాయలపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్, తెలుగు సబ్జెక్టుల్లో గెస్ట్ టీచర్లుగా పనిచేసేందుకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఏ.జోత్స్న తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ డిగ్రీ, బీఈడీని ఇంగ్లిష్ మీడియంలో పూర్తి చేసి ఉండాలన్నారు. ఉపాధ్యాయ అనుభవం కలిగి, టెట్ పాసైన వారికి ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు విద్యార్హత సాఫ్ట్ కాపీని జూలై 3వ తేదీలోపు mjpapbcwreispalamaner @gmail. com మెయిల్ చేయాలని సూచించారు. వివరాలకు 95157 64818 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

చిత్తూరు అర్బన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 32 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎఫ్‌సీకి క్యూ కట్టిన వాహనాలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి శుక్రవారం ఎఫ్‌సీ చేయించుకునేందుకు వాహనాలు క్యూ కట్టాయి. ఇందులో ద్విచక్రవాహనాలతో పాటు లారీలు, ట్రక్కులు, కార్లు, అధిక సంఖ్యలో బడి బస్సులు ఉన్నాయి. బండి కండిషన్‌ను రవాణాశాఖ అధికారులు క్షుణంగా పరిశీలించారు. లోటుపాట్లు ఉంటే వారి సరిదిద్దుకునేలా సూచనలు చేశారు. పక్కాగా ఉండే వాహనాలకు మాత్రమే ఎఫ్‌సీ మంజూరు చేశారు. మొత్తం 38 వాహనాలకు ఫిట్‌నెస్ టెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

1 నుంచి ఓపెన్ వర్సిటీ ప్రాక్టికల్స్

చిత్తూరు కలెక్టరేట్ : అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం అభ్యర్థులకు జూలై 1వ తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కో-ఆర్డినేటర్ మీరా సాహెబ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి మొదటి సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. కుప్పం, పలమనేరు, మదనపల్లె స్టడీ సెంటర్లలోని సైన్స్ గ్రూప్ అభ్యర్థులు చిత్తూరులోని కేంద్రంలో పరీక్షలు రాయాలని సూచించారు. ఉదయం 10 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు 7382929664, 95736 07925 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎన్నికల విధులకు వేతనం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులకు ఒక నెల గరిష్ట వేతనానికి సమానంగా చెల్లించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులు శుక్రవారం కలెక్టరేట్‌కు చేరాయి. ఆ ప్రకారం చెల్లింపులకు కలెక్టరేట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆయా అధికారులు, ఉద్యోగుల ఖాతాల్లో ఎన్నికల విధుల నగదు జమ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాలకు దోమల ఉధృతి పెరిగిందన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని చెప్పారు. క్షేత్రస్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ పారిశుద్ధ్య మెరుగుతోపాటు దోమల కట్టడికి చేపట్టిన చర్యలను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. జ్వరాలు, డెంగీ, మలేరియా, ముఖ్యంగా డయేరియా వంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. లక్షణాలు బయటపడితే అలాంటి వారికి మెరుగైన వైద్యం అందించి కోలుకునేంత వరకు పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు. గర్భిణులకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని, టీకాలను సకాలంలో వేయించాలని కోరారు.

కేజీబీవీ కాంట్రాక్ట్ ఉద్యోగుల కొనసాగింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కేజీబీవీ (కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ) పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను కొనసాగించాలని రాష్ట్ర సమగ్రశిక్ష అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో కేజీబీవీల్లో చదివే పది, ఇంటర్మీడియట్ బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించేలా టీచర్లు చర్యలు చేపట్టాలని షరతు విధించారు. బోధనా నైపుణ్యం, సామర్థ్యాలను మెరుగుపరచుకునేందుకు శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

బ్యాంకు రుణాల పేరిట మోసం

– కేసు నమోదు చేసిన పోలీసులు

చిత్తూరు అర్బన్: బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని నమ్మించి పలువురు మహిళల నుంచి నగదు వసూలు చేసిన వ్యక్తిపై చిత్తూరు టూటౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ ఉలసయ్య కథనం మేరకు.. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన శివప్రసాద్ గత ఏడాది చిత్తూరు నగరంలో ఓ కార్యాలయం ప్రారంభించాడు. రూ.3 వేలు చెల్లిస్తే రూ.లక్ష రుణం బ్యాంకు ద్వారా ఇప్పిస్తానని ఓటి చెరువు, ప్రశాంత్ నగర్ కాలనీకి చెందిన పలువురు మహిళలను నమ్మించాడు. వారి నుంచి డబ్బులు వసూలు చేసి, కొందరికి నాసిరకం గ్రైండర్లు ఇచ్చి మోసం చేశాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టీడీపీ నేతలపై కేసు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరానికి చెందిన టీడీపీ నేతలు బాలాజీ, రాజేష్‌పై టూటౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ ఉలసయ్య కథనం మేరకు.. న్యాయవాది సతీష్‌తో బాలాజీ, రాజేష్‌కు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. రెండు రోజుల క్రితం బాలాజీనగర్‌లోని సతీష్ ఇంటికి బాలాజీ, రాజేష్ తదితరులు వెళ్లారు. తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుంటే అంతు చూస్తామని బెదిరించారు. సతీష్ బొలేరో కారును తీసుకెళ్లిపోయారు. న్యాయవాది దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు బోల్తా : ఒకరి మృతి

బంగారుపాళెం : మండలంలోని మొగిలి ఘాట్ వద్ద శుక్రవారం రాత్రి కారు బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. చిత్తూరు నుంచి పలమనేరు వైపు వెళుతున్న కారు ముందు వాహనాన్ని ఓవర్ టేక్ చేసి మరో వాహనాన్ని ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కేరళలో ఆలంపురం జిల్లా కత్తనం గ్రామానికి చెందిన ఆదిత్య(20)మృతి చెందగా, క్రితిక్, కారు డ్రైవర్ ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డారు.ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిఇ తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మయ్య తెలిపారు.

అక్కడ ఉద్యోగం.. ఇక్కడ వ్యవసాయం



విదేశంలో ఇంజినీర్ ఉద్యోగం చేస్తూ.. వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నారు. ప్రకృతి సాగుపై మక్కువ పెంచుకుని పంటల సాగును ప్రారంభించారు. తమకున్న 30 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడిని సాధిస్తున్నారు. సేంద్రియ విధానంలో నాణ్యమైన ఉత్పత్తులను రాబడుతున్నారు. సొంతంగా మార్కెటింగ్ చేసుకుంటూ అధిక ఆదాయం ఆర్జిస్తున్నారు.

- పండ్ల తోటల సాగులో వినూత్న విధానం
- సొంతంగా మార్కెటింగ్ చేసుకుంటూ అధిక ఆదాయం
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు శ్రీధర్

కాణిపాకం: చిత్తూరులోని నరిగపల్లెకు చెందిన శ్రీధర్‌ది వ్యవయసాయ కుటుంబం. తల్లిదండ్రుల కష్టార్జితంతో బీటెక్ వరకు చదువుకున్నారు. 14ఏళ్ల క్రితం విదేశాలకు వెళ్లారు. ప్రస్తుతం జర్మనీలో సెమీ కండక్టర్ ఇండస్ట్రీలో పనిచేస్తున్నారు. అక్కడ పనిచేసుకుంటూ..తల్లి సహకారంతో సొంతూర్లో వ్యవసాయం చేసుకుంటున్నారు. తండ్రి ఇచ్చిన నాలుగు ఎకరాలను 30 ఎకరాలకు పెంచారు. వ్యవసాయంలోనే నూతన ఒరవడి సృష్టించాలనుకున్నారు. ప్రకృతి వ్యవసాయంతో పంటల సాగులో సరికొత్త ఒరవడి సృష్టించారు.

మామిడిలో 32 రకాలు

తన 30 ఎకరాల్లో శ్రీధర్ వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. ప్రధానంగా 24 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఇందులో 32 రకాల మామిడిని సాగు చేస్తున్నారు. తోతాపురి, మల్లిక, ఇమామ్ పసంద్, కాలేపడు, దోరి, బంగినపల్లె, అల్ఫాన్స్, నీలం, కేసర్, అత్తి మధురం వంటివి పలురకాలు సాగులో ఉన్నాయి. వీటికి రసాయనాలు వాడకుండా సేంద్రియ ఎరువులు వాడుతున్నాడు. పంట ఎదుగుదలకు పశువుల ఎరువులు వాడుతున్నారు. అలాగే జీవామృతం వేస్తున్నారు. పంటను హాని కలిగించే పురుగులు ఆశించ కుండా వేపనూనె, కానుగనూనె పిచికారీ చేస్తున్నారు. తర్వాత మట్టి ద్రావణంతో ఆముదం నూనె స్ప్రే చేస్తున్నారు. దీంతో పంటను తెగుళ్ల ఆశించడంలేదని చెబుతున్నారు. కాయ నాణ్యత, రుచి కోసం నవ ధాన్యాలను మొలకెత్తించి..వాటిని పిండి చేస్తారు. వాటిని నీటిలో కలిపి చెట్లకు స్ప్రే చేయిస్తున్నారు. మజ్జిగను నీటితో కలిపి చెట్లకు పిచికారీ చేయిస్తున్నారు. కలుపు నివారణకు జీలుగా, జనుము చల్లుతున్నారు. 24 ఎకరాలకు గాను ఏడాదికి పెట్టుబడి ఖర్చులు రూ.1.30 లక్షలు అవుతున్నట్లు వెల్లడిస్తున్నారు.

మార్కెటింగ్ ఇలా..

విదేశంలోనే ఉంటూ.. పంట స్థితిగతులను ఎప్పటికప్పుడు తల్లిని అడిగి తెలుసుకుంటున్నారు. కోత సమయానికి గ్రామానికి చేరుకుని మార్కెటింగ్‌పై దృష్టి సారిస్తుంటారు. 31రకాలు అంటే మల్లిక, ఇమామ్ పసంద్, కాలేపడు, దోరి, బంగినపల్లె వంటి కాయలను కోత కోసి..పండుగా మారేంత వరకు స్టోరేజ్ గదిలో భద్రపరుస్తారు. వీటిని ఫొటో తీసి గూగుల్ ఫామ్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ లింక్‌ను బెంగుళూరులోని 16 ఆర్గానిక్ స్టోర్‌లతో పాటు పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్‌లోని వ్యక్తులకు పంపిరుడు. అలా ఆర్డర్లు వచ్చిన వారికి నేరుగా విక్రయించుకుంటున్నారు. దీంతో కాలేపడు టన్నుకు రూ. 2.50 లక్షలు, మిగిలిన రకాలు రూ. 2 నుంచి రూ. 1.50 లక్షల ఆదాయం తెచ్చిపెడుతోందని వివరిస్తున్నారు. కూలీ, రవాణా ఖర్చులకు రూ. లక్ష పోను చేతికి రూ. 11 లక్షలు మిగిలిందని ఆనంతంగా చెబుతున్నారు.

పలు రకాల పండ్ల తోటలు..

మామిడితో పాటు మిగిలిన ఆరు ఎకరాల్లో పలు రకాల పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. రెండు ఎకరాల్లో సపోటా, నాలుగు ఎకరాల్లో అరటి, బొప్పాయి, జామ, సీతాఫలం వంటి పండ్ల తోటలు సాగులో ఉన్నాయి. దీంతో పాటు 35 పండ్ల మొక్కలు నాటారు. ఇక ఇంటికి అవసరమైన కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇవన్నీ కూడా ఇప్పుడిప్పుడే దిగుబడి మొదలుకావడంతో బయటి మార్కెంటింగ్‌పై దృష్టిపెడుతున్నారు. పంట సంజీవని కుంటలో చేపలు పెంపకం చేస్తున్నారు. పొలం గట్టుపై టేకు, కొబ్బరి, రోస్‌వుడ్ వంటి రకాల చెట్లు 4,600 వరకు పెట్టామని శ్రీధర్ వెల్లడిస్తున్నారు.

నాణ్యతకే ప్రాధాన్యం...



రసాయన మందుల వాడడంతో పండ్ల తోటలకు కొత్త రోగాలు వస్తున్నాయి. ఆ పండ్లు తిన్న కొంగలు, పక్షులు చనిపోతున్నాయి. అందుకే మనిషికి హాని కలిగించే రసాయనమందులను వాడడంలేదు. సేంద్రియ ఎరువులనే వాడుతున్నాం. దీంతో కాయ దిగుబడిని పక్కన పెడితే నాణ్యత, రుచి బాగుంది. ఆర్గానిక్ పంటలకు మార్కెట్లో కూడా డిమాండ్ బావుంది. మా అమ్మ సహకారంతో పంటను కాపాడుకుంటూ వస్తున్నా.

– శ్రీధర్, రైతు, చిత్తూరు



వాహనంలో కాయల ట్రేలు ఎక్కిస్తున్న దృశ్యం



చెట్టు నిండుగా కాయలు



చేపల పెంపకం చేపట్టిన పంట సంజీవని కుంట

దర్జాగా కబ్జా



టీడీపీ నేత ఆక్రమించిన ప్రభుత్వ భూమి

- గని భూమిని ఆక్రమించిన టీడీపీ నేత
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

వి.కోట : అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. కంటికి కనిపించిన భూములను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. అందులో భాగంగానే మండలంలోని కొంగాటం పంచాయతీ కుప్పం–పలమనేరు జాతీయ రహదారిపై రామకుప్పం మండలానికి వెళ్లే దారిలో స్థానిక టీడీపీ నేత భూ కబ్జాకు పాల్పడ్డాడు. సర్వే నంబర్ 305/2లో 15 ఎకరాల 64 సెంట్ల గనికి సంబంధించిన భూమిని ఆక్రమించుకున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ భూమిని అటవీశాఖకు అప్పగించగా, వారు అందులో నీలగిరి వృక్షాలు పెంచారు. అయితే ఈ భూమిని కబ్జా చేసిన సదరు టీడీపీ నేత యంత్రాల సాయంతో రెండు రోజులుగా చదును చేయిస్తున్నాడు. అందులో చెట్లను తొలగిస్తున్నాడు. ప్రశ్నించిన గ్రామస్తులను బెదిరిస్తున్నాడు. రూ.కోట్ల విలువైన భూమి కబ్జాకు గురవుతున్నా స్థానిక రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. జిల్లా అధికారులైనా స్పందించి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా, కబ్జా విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే పనులు ఆపివేయించామని తెలిపారు.

వేతన బకాయిల మంజూరుకు ధర్నా



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆయాలకు పెండింగ్ జీతాలను వెంటనే మంజూరు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఈమేరకు డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా ఆయాలకు జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు . వేతన బకాయిలు చెల్లించడమే కాకుండా, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సంఘం గౌరవాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ కార్మికులకు జీతాలు చెల్లించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న ఉన్నత పాఠశాలల్లో అదనపు ఆయాలను నియమించాలని స్పష్టం చేశారు.

కార్మికులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని, చెప్పులు, గ్లౌజులు, మాస్కులను ప్రభుత్వమే అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈఓ దేవరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయకుమార్, స్వీపర్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయకుమారి ఏఐటీయూసీ జిల్లా నాయకులు దాసరి చంద్ర, రమాదేవి, గోవిండ్ స్వామి, లతారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ



బాధితురాలితో మాట్లాడుతున్న పోలీసులు

తవణంపల్లె : మండలంలోని కామాలూరు సమీపంలో ఓ వృద్ధురాలి మెడలో గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన భీమేశ్వరరెడ్డి తన కుటుంబంతో కసి ఊరికి దూరంగా ఉన్న మామిడితోటలో ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం భీమేశ్వరరెడ్డి తన భార్యా పిల్లలతో కలిసి పొలంలో పనులు చేసుకునేందుకు వెళ్లాడు. ఆయన తల్లి చంద్రకాంతమ్మ ఇంటి ముంగిట కూర్చుని ఉండగా ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చారు. దాహం తీర్చుకునేందుకు నీరు కావాలని అడిగారు. ఆమె లోపలికి వెళుతుండగా కిందపడదోసి మెడలోని గొలుసు లాక్కుని బైక్‌పై పరారయ్యారు. బాధితురాలు కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు, పొలంలో ఉన్న కుటుంబసభ్యులు సైతం పరుగున ఇంటి వద్దకు చేరుకొని వివరాలు తెలుసుకొన్నారు. దీనిపై సమాచారం అందుకున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, చిత్తూరు రూరల్ సీఐ రవిశంకర్‌రెడ్డి, తవణంపల్లె ఇన్‌చార్జి ఎస్‌ఐ రామ్మోహన్, ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. భీమేశ్వర్‌రెడ్డి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆవుల చోరీ కేసులో ఇద్దరికి జరిమానా

చిత్తూరు అర్బన్: ఆవులను అపహరించిన కేసులో ఇద్దరు నిందితులకు జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఉమాదేవి శుక్రవారం తీర్పునిచ్చారు. 2021, 2022లో బంగారుపాళ్యం మండలంలోని ఎద్దుల వారిపల్లె, మడిపవాళ్లవూరు గ్రామాల్లో నాలుగు ఆవులు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇదే మండలంలోని దగ్గువారిపల్లెకు చెందిన కిరణ్‌కుమార్ (21), రూపేష్ (27)ఈ చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. అప్పటికే ఆవులను రూ.1.50 లక్షలకు నిందితులు అమ్మేశారు. ఈ మొత్తం స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితులు రూ.10వేల చొప్పున జరిమానా చెల్లించాలని, లేకుంటే 6 నెలల జైలుశిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఏనుగుల కట్టడిలో వైఫల్యం

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఏనుగులను కట్టడి చేయడంలో అటవీశాఖ అధికారులు వైఫల్యం చెందారని రైతు సంఘం నేతలు మండిపడ్డారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. పలమనేరు, బంగారుపాళ్యం, తవణంపల్లె తదితర మండలాల్లో ఏనుగులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయన్నారు. ఈక్రమంలో పంటలను నాశనం చేయడంతో పాటు రైతులపై దాడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి అడవి ప్రాంతాలోసోలార్ ఫెన్సింగ్ వేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నాగరాజు, మునిరత్నంనాయుడు, దాసరిచంద్ర పాల్గొన్నారు.

కృషి కేంద్రం కోసం భూముల పరిశీలన

శాంతిపురం : దండికుప్పం పంచాయతీ నల్లరాళ్లపల్లె వద్ద ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములను జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. కుప్పం నియోజకవర్గంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించటంతో అనువైన స్థలం ఎంపిక చేసేందుకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే నల్లరాళ్లపల్లె– కదిరిముత్తనపల్లె మధ్య భూములను పరిశీలించినట్లు జేసీ వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్ఐలు మధుసూదన్, యోగానంద పాల్గొన్నారు.

పింఛన్ పత్రాల ముద్రణకు నిధులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పత్రాల ముద్రణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర సెర్ప్ సీఈఓ శోభాషణ్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో 2,71,693 మంది పింఛనదారులగాను సర్టిఫికెట్లు ముద్రించేందుకు రూ.1.36 లక్షలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

హనుమంతునిపై సుందరరాజస్వామి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ సుందరరాజ స్వామివారి అవతార మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం రాత్రి హనుమంత వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం శ్రీ కృష్ణస్వామివారి ముఖ మండపంలో శ్రీసుందరరాజ స్వామివారికి వైభవంగా అభిషేకం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, చందనాలతో వేడుకగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ స్వామివారి ముఖ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారి హనుమంత వాహన సేవ వైభవంగా సాగింది. శనివారం రాత్రి స్వామివారు గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, సూపరిటెండెంట్ మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుభాష్, గణేష్, అర్చకులు బాబు స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు



ఆలయంలో పరిశీలిస్తున్న పోలీసులు

పెనుమూరు(కార్వేటినగరం) మండలంలోని కలవకుంటలో ఉన్న శివాలయంలో గుప్త నిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు తవ్వకాలకు పాల్పడినట్లు శుక్రవారం గుర్తించారు. పూజారి కార్తీక్ మాట్లాడుతూ గతంలో కూడా ఈ ఆలయంలో తవ్వకాలు జరిగాయని, ఎవరూ పట్టించుకోకపోవడంతో మళ్లీ తవ్వకాలు చేపట్టారని తెలిపారు. దీంతో ఆలయంలోని విగ్రహాలు పూర్తిగా ధ్వంసమైనట్లు వివరించారు. వినాయకుడి విగ్రహాన్ని ఏకంగా పగులగొట్టి తీసుకెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమాచారం అందుకున్న చిత్తూరు డీఎస్పీ, సీఐ కుళ్లాయప్ప, ఎస్ఐ లోకేష్ గ్రామానికి చేరుకున్నారు తవ్వకాలు జరిగిన ప్రాంతాలను పరిశీలించారు.

వ్యక్తి ఆత్మహత్య



హేమాద్రి మృతదేహం

బంగారుపాళెం: మండలంలోని కేజీ సత్రం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడినట్టు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు. గ్రామానికి చెందిన హేమాద్రి(35) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్థాపానికి గురై వంట గదిలో ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబీకులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెల్లడించారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పలమనేరు : గంజాయి స్మగ్లింగ్ కేసులో పరారీలో ఉన్న విశాఖపట్నానికి చెందిన కాశీనాథ్ అలియాస్ కాశీ అనే వ్యక్తిని శుక్రవారం కాణిపాకం క్రాస్ వద్ద అరెస్ట్ చేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. పాత కేసులో ఏ–7గా ఉన్న కాశీనాథ్ అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో మిగిలిన ఆరుగురు నిందితులను గతంలోనే అరెస్ట్ చేశామని వెల్లడించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందికి రూ.1.10 లక్షల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శుక్రవారం తీర్పునిచ్చారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గురువారం చిత్తూరు నగరంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 11 మందిపై కేసు నమోదుచేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

లైంగిక వేధింపుల వివరాలు పంపండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పాఠ శాలల్లో లైంగిక వేధింపుల ఘటనల జరిగి ఉంటే ఆ వివరాలను పంపాలని రాష్ట్ర విద్యాశాఖ కో–ఆర్డినేషన్ డైరెక్టర్ పార్వతి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలల్లో లైంగిక వేధింపులు, ర్యాగింగ్ సమస్యలపై ఫిర్యాదులు, ఘటనలు జరిగి ఉంటే ఆ వివరాలను నివేదికలో పొందుపరిచి పంపాలని సూచించారు.